

చంపేస్తా!

కవనశర్మ

ఆ ఊళ్లో బ్రహ్మచారుల కెవ్వరు ఇళ్లు అద్దెకివ్వరు. అందుకనే దొరికిన ఒకే ఒక యింట్లో, అది దయ్యాలకొంపే అవుగాక, ఒబ్బిడిగా ఇమిడిపోయారు. ఆ యింట్లో పూర్వం జమిందారు అయిన, పెద్దమనిషి కాని శాల్తీ ఉండేది. అతగాడు తన కిష్టంలేనివాళ్ళని పెద్ద కష్టం లేకుండా పైకి పంపించేస్తూ, తను ఇష్టపడ్డ అమ్మాయిల్ని లోపలికి తెప్పించుకొని వాళ్ళు బయటకు పోనీయకుండా జాగ్రత్తపడుతూ పులిలా బతికాడు.

ఆ జమిందా రెప్పుడూ "ఓ అర్ధరాత్రిపూట ఏ ఆడపిల్లయినా నా యింటి తలుపు బాదుతుందనుకోండి విననట్టు ఊరుకొంటానేగాని తలుపులు తెరవను" అనేవాడందరితో వినయంగా. కొన్నాళ్ళకి ఆ ఊళ్లో కొందరికి ఆ మాటలు అక్షరాల నిజమని తెలిసింది. వాళ్ళ అమ్మాయిలు, తలుపులు బాదినా, అర్ధరాత్రవటంచేత ఆ జమిందారు తలుపులు తెరవలేదని అందుకని రాత్రంతా వాళ్ళమ్మాయిలు ఆ యింటి లోపలే ఉండిపోవాల్సి వచ్చిందని వాళ్ళకి అర్థమయింది. అందులో కొందర్ని జమిందారు ఈతి బాధల్నుంచి తప్పించాడు. కాని కొన్ని చలిచీమలు ఆ బలవంతమైన సర్పాన్ని ఆనమాలు లేకుండా చంపేసాయి.

జమిందారు కొడుకు అందుకని ఆ ఊరు వదిలిపెట్టి దూరంగా వెళ్ళిపోయాడు. అందుకని వాళ్ళ ఇల్లు ఖాళీగా ఉంటోంది. ఒకరిద్దరు ఆ యింట్లో దిగి ఆపైన జమిందారు దయ్యం వాళ్ళని సుఖంగా ఉండనివ్వలేదన్న పుకారు పుట్టించి మరీ లేచిపోయారు

ఆ యింట్లో దిగిన ఒకరు, తను ఆ యింట్లో ఉంటున్నంతకాలం తనకి తన పై ఆఫీసర్ని హత్య చెయ్యాలన్న కోరిక బలంగా వుండేదని, ఆ యిల్లు మార్చాక, ఆ కోరిక అంత బలంగా కలగటంలేదని అన్నారు, యిల్లు మారాక.

మరొకరు ఆ యింట్లోకి మారిన కొద్ది రోజులకి పనిపిల్ల చెయ్యి దొరక బుచ్చుకొని పెళ్లానికి దొరికిపోయారు ఆ క్షణంలో తనని జమీందారు దయ్యం ఆవహించి ఉందని లేకపోతే తనాపని చేసేవాడు కాదని అన్నాడు దొరికిపోయిన అతను పైగా తనా యింట్లోకి మారి ఉండకపోతే తను ఆ పిల్లలను తన హస్తాలలో బంధించేవాడు కాడని అప్పుడు తన భార్య ఆ పిల్ల గింజుకోడం చూడగలిగేది కాదని అందరి దగ్గరా మొత్తుకొన్నాడు అతను అతని భార్య ముందర పనిపిల్లని, తరువాత ఇంటిని మార్చింది. "ఇల్లాంటి దింకోసారి జరిగితే నిన్నుకూడా మారుస్తాను" అంటూ భర్తను బెదిరించిందని కొందరంటారు దానికి నమ్మదగ్గ ఆధారాలు లేవు

ఏది ఏమైనా ఆ యిల్లు దయ్యాలకొంపగా పేరు తెచ్చుకొంది అందులో ఎవరు ఉండటాని కిష్టపడక పోవడంవల్ల ఖాళీగా ఉంటూ వచ్చింది అదే ఆ అయిదురు బ్రహ్మచారుల పాలిట వరం అయింది వాళ్ళు ఆ యింట్లో ఉంటామని చెప్పి ఆ జమీందారు కొడుకుకి బంధువైన ఆయనదగ్గర తాళం చెవులు తీసుకొన్నారు అద్దెకింద అందరూ తలా వంద ఆ పెద్ద భవంతికి కట్టామన్నారు

ఆ విధంగా సుబ్బారావు, విశ్వనాధం, రాజా, ప్రసాద్, రెడ్డి ఆ యింట్లో గృహప్రవేశం చేసారు ఆ చిన్నసైజు పట్టణంలో చిన్నచిన్న ఆఫీసు లున్నాయి వాటికి చిన్న, చిన్న ఆఫీసర్లున్నారు సుబ్బారావు, విశ్వనాథం అల్లాంటి ఆఫీసర్లు ఆ చిన్న పట్టణంలో ఓ చిన్న కాలేజీ, అందులో అందంగా అలంకరించుకొని తిరగటానికి విద్యార్థినులు, వాళ్ళ శ్రమ వృధా పోకుండా, వాళ్ళను చూసి మెచ్చుకోటానికి అబ్బాయిలు ఉన్నారు ఇవన్నీ అమిరాక ఆ కాలేజీలో లెక్చెరర్స్ ఉండకపోతే బావుండదని కొంతమందిని లెక్చెరర్స్‌గా వేసారు అల్లా ఆ ఊరు వచ్చినవాళ్ళు రాజా, ప్రసాద్‌లు ఇంక పోతే రెడ్డి ఆ ఊళ్ళో అందరికి అప్పుడో ఇప్పుడో తలకాయనొప్పి రావటం, జ్వరం రావటం మొదలుపెట్టాక వాళ్ళ రోగాలు కుదర్చటానికి, ఓ డాక్టరు, అతడి రోగం కుదర్చటానికి పోటీగా మరికొందరు డాక్టర్లు దిగారు. "వాళ్ళ రోగులచేత మందులు కొనిపించేలా చూడు" అంటూ ఓ మందుల కంపెనీ రెడ్డి నా పూరు శాంపిల్స్ ఇచ్చి పంపించింది

ఆ అయిదుగురు పూర్వం వాళ్ళ ఊరైన మరో ఊళ్ళో ఒకే బళ్లో చదువుకొని ఉద్యోగ రీత్యా ఆ ఊళ్లో ఉంటున్నారు ఎవరికి పెళ్ళి కాలేదు అందుకని నిశ్చింతగా పేకాడుకొంటూ హాయిగా ఉంటున్నారు ఆ యింట్లో ఎవరి గదులు వాళ్ళకే ఉన్నాయి డ్రాయింగ్‌రూమ్, బాత్రూమ్, వంటిల్లు లాంటివి ఉమ్మడిగా వాడుకొంటారు

ఓ ఆదివారం సాయంత్రం ప్రసాద్, రెడ్డి, సుబ్బారావు, విశ్వనాధం పేకాడుకొంటున్నారు ఆరోజు వాన ఛడామడా కురిసింది ఆ వానకి మనుష్యులు వెర్రెత్తిపోయున్నారు ఆడుతున్న ఆట ఆంధ్రుల అభిమానపు ఆట, అడ్డాట. సుబ్బారావుకి ఆ ఆట బాగావచ్చు రెడ్డికి ఏ ఆటా సరిగ్గా రాదు అందుకని వాళ్ళిద్దరు ఒక పార్టీగా కూర్చున్నారు ప్రసాద్, విశ్వనాధం ప్రతిపక్షం

ప్రసాద్ ముక్కలు పంచాడు విశ్వనాధం ఇస్పేటు తురుపు చెప్పాడు అంతవరకు బాగానే జరిగింది అప్పుడు రెడ్డి అడ్డుపెట్టాడు సుబ్బారావుకి భగ్గున మండింది ప్రసాద్ షరతు పెట్టగానే రెడ్డిమీద కోపం తారస్థాయి నందుకొంది

"దిగుడు చెయ్యి అడ్డు పెట్టచ్చు రా! సన్యాసీ!" అని దెబ్బలాడాడు రెడ్డికూడా కోపం వచ్చింది తన ఆటలో తప్పుపట్టినందుకు కాదు తనని సన్యాసీ అంటాడా ఈ సుబ్బిగాడు అని అందుకని ప్రసాద్‌కి తన ముక్కల్ని చూపిస్తూ,



"నా ముక్కల్చూసావు కదా! నాకు అడ్డు పెట్టే ముక్కల్రాలేదూ" అని అడిగాడు

"ప్రసాద్‌కి ముక్కల్చూపిస్తా వేమిట్రా?" అని సుబ్బారావు కోపంతో అరిచాడు

"వాడు చూపించాడేమోగాని నేను చూడ లేదు వాడికి అడ్డుపెట్టే ముక్కలు వచ్చాయని నా అనుమానం" అన్నాడు ప్రసాద్ కొంచెం తీవ్రంగా

"సుబ్బయ్యా? చెప్తే పైషర్తు చెప్ప లేక పోతే ప్రసాదం ముక్కలు పంచుతాడు" అని విశ్వనాథం విసుక్కున్నాడు సుబ్బారావు పై షరతు పెట్టాడు ప్రసాద్ పంచాడు

రెడ్డి లెక్కల్లో పడ్డాడు విస్సిగాడి చెయ్యి రెండు అడ్డు నాలుగు షరతు ఎనిమిది పై షరతు పదహారు అయ్యబాబోయి పదహారాటలు! ఈ ఆట తాము గెలవాలి! అని బోలు డంత ఉత్సాహంతో తురఫేడు ఆడాడు

"ఎదుర్తుర ఫాడ్తా వేమిట్రా? తురఫేడు దిగొచ్చా?" అని సుబ్బారావు, రెడ్డి ముక్క వెనక్కి తీసుకోమని సూచించాడు

"ఎం దిగాలి?" రెడ్డి ఎందుకైనా మంచిదని ఆ ముక్క వెనక్కి తీసుకొంటూ అడిగాడు

"తురవు చెప్పినవాడి కిందిచెయ్యివాడు పదిబంతి దిగాలి" అని సుబ్బారావు వివరించాడు

"ఆడవాళ్ళుకూడా ఇలా చెప్పుకొని ఆడు కోర్రా!" అని ప్రసాద్ వెక్కిరించాడు

రెడ్డి తురపు పది దిగాడు

"నీ తెలివి తెల్లారా! అది తురపు పదిరా!" సుబ్బారావు నెత్తికొట్టుకొన్నాడు

"రెడ్డిని అనవసరంగా కంగారు పెట్టకురా సుబ్బయ్యా! మహా అయితే మీరు ఈ ఆటో డ్తారు తోముడు మీ చేతి కొస్తుంది! అంతేగా" అని విశ్వనాధం సర్ది చెప్పాడు

రెడ్డి ముక్క వెనక్కి తీసుకొన్నాడు ఆపైనేమో "ఒరే సుబ్బిగా! తురఫేడు పనికి రాదన్నావు పది దిగమన్నావు! దిగాను. తిన్నగా తురపు పది కాకుండా మరేదన్నా పది దిగమని ఉంటే అల్లాగే దిగి ఉందును కదా! నీకు ఆఫీసులో గుమాస్తాలు డ్రాఫ్టులు పెడ్తుంటే వంకలు పెట్టడం అలవాటై ఇదికాదు అదికాదు అంటావేకాని ఏది అవునో చెప్పవు" అని సుబ్బారావు నుద్దేశించి ఓ చిన్న ఉపన్యాసం ఇచ్చి ఆపైన డైమన్ పది దిగాడు

విశ్వనాధం "ఇందాకటి ముక్క అక్కడ పెట్టి ఇది తియ్యి! రెడ్డమ్మా!" అని అన్నాడు

"నువ్వు ఇంకా ముక్క దిగలేదుగా అందు

కని తీసుకొన్నాను" అన్నాడు రెడ్డి

"అదంతా నాకు తెలియదు నువ్వు స్పేడు పది ఆడాలి!" అన్నాడు విశ్వనాధం

రెడ్డి డైమన్ పది వెనక్కి తీసుకొన్నాడు

"ఒరేయ్! రెడ్డీ! నువ్వు స్పేడు పది దిగితే నేను నీ పార్టీలో ఆడను" సుబ్బారావు బెదిరించాడు రెడ్డి ఆ బెదిరింపుకి బెదర దలుచుకోలేదు

"మానెయ్యి నేను నా ముక్కల్తోసహా విస్సిగాడి పార్టీలోకి వెళ్ళిపోయి నిన్ను చిత్తుగా ఓడించేస్తాను నాదగ్గర మూడు తురుపులు బోలుడు హుకుం ఉన్నాయి నీకు పదహారాటలు ఎక్కుతాయి! అల్లాచేస్తేగాని నీకు తిక్కొదల్దుదురా! సుబ్బిగా!"

"తొందరగా ఏదో ముక్క దిగేడువ్!" అన్నాడు ప్రసాద్ అసహనంగా

"స్పేడ్ టెన్ కాక మరో ముక్క దిగితే పీక నులిమేస్తాన్రా రెడ్డీ!" విశ్వనాధం వార్నింగ్ ఇచ్చాడు

"ఆ ముక్కే దిగితే నిన్ను ఇవాళ నరికెయ్యడం ఖాయం" అని సుబ్బారావు తుది హెచ్చరిక చేసాడు

"దిగితే వీడు చంపుతాడుట, దిగకపోతే వాడు చంపుతాడుట ఒరేయ్ ప్రసాద్! నీలాంటి మంచివాళ్ళు ఎక్కడోగాని ఉండర్రా! ఓరి విస్సి సుబ్బిగాళ్ళలారా! మీ కిదియె శాస్తి! మీతో నేనసలు ఆడను పొండి మీరు నన్నడ్డమైన మాటలు అంటుంటే పడటానికి నేనేమైనా మీ దగ్గర పన్చేసే పీనుగ్గుమాస్తానా? పడను ఆడను పొండి!" అన్నాడు రెడ్డి కోపంగా.

"బతికించావు పో" అన్నాడు సుబ్బారావు

"అసలే బోరుకొట్టి ఛస్తోంది ఆ బుద్ధిలేని సుబ్బారావుతో నీకేమిటి? నీ యిష్టం వచ్చినట్టు ఆడు" అని బతిమాలాడు ప్రసాద్

"నాకు బుద్ధి లేదంటావురా? స్టుపిడ్!" సుబ్బారావు పైకి లేచాడు

"ఏదో మన రెడ్డిని కాస్త నానబెట్టి సాఫెన్ చేద్దామని."

"నేను తోలుముక్కనా నానబెట్టడానికి. నేను నానను మెత్తపడను"

విశ్వనాధం కల్పించుకొన్నాడు "ఒరేయ్ సుబ్బయ్యా!నువ్వు రెడ్డికిక్షమాపణలు చెప్పుకో. నేను కూడా ఛెప్తాను తప్పేదేముంది! వసు దేవుదేం చేసాడు?"

"నేను గాడిదనా? నేను తోలు ముక్కనా? ఆగండ్రా మీపని సమయం చూసి పడ్తాను" అంటూ రెడ్డి పేక ముక్క లక్కడపారేసి దూరంగాపోయి కూర్చున్నాడు

ప్రసాద్ "రెడ్డీ! రా అమ్మా! విశ్వనాధంగాని సుబ్బారావుగాని నీమీద చెయ్యివేస్తే ఆ పడ్డ చేతిని అక్కడి కక్కడే విరిచేస్తాను దా అమ్మా!" అని బతిమాలాడు

రెడ్డి "డైమను పది దిగనిస్తే అయిందా! మరో ఆటలో నేను మర్చిపోయి మణేలా దిగుతాను నువ్వు జాకీ దిగుతావు నువ్వు కాకపోతే విస్సిగాడు దిగుతాడు వాడివన్నీ అల్లాంటి వెధవ బుద్ధులే! అప్పుడేమో ఈ సుబ్బిగాడు నన్ను చంపుతానని లేస్తాడు నేనీ ఊరు ఉద్యోగంచేసి బతుకుదామని వచ్చాను కాని వీడితో పేకాడి చద్దామని రాలేదు! అందుకని నేను ఆడనుగాక ఆడను" అని తెగేసి చెప్పాడు.

కాస్సేపాటు మౌనం రాజ్యమేలింది చివరికి విశ్వనాధం అన్నాడు

"నిన్నట్నుంచి రాజాగాడు పికర్ లేకుండా పోవటంతో ఈ రెడ్డిని పెట్టుకొని పేకాడాల్సి వచ్చింది ఆ వెధవెక్కడ చచ్చాడో!"

"అవును వాడు వాడి బులపాలన్నీ కని వారాలు తీర్చుకొని ఆదివారాలు ఇంట్లోనే చచ్చినట్టు పడుండేవాడు బ్రిడ్జో, అడ్డో ఆడుకునే వాళ్ళం" అన్నాడు ప్రసాద్

"ఇవాళ రాజాలేని లోటు కొట్టొచ్చినట్టు తెలుస్తోంది రా" అన్నాడు సుబ్బారావు

రెడ్డి అందరి మాటలు విని దూరంగా కూర్చున్నవాడల్లా లేచివచ్చి,

"ఏమిటి మీకు రాజా లేని లోటు తెలిసి వస్తోందా? వాడిని మీరు పేకాటలో తిట్టని రోజుందా? నాకంటే ఆటరాదు అడ్డమైన మాటలంటారు పడ్డాను పడ్డవాడెప్పుడు చెడ్డ

వాడు కాదు కాని రాజాని మీరెన్నేసి మాట లంటారు! మీ కుక్కబుద్ధులు మీకు తెలిసేలా చెయ్యాలనేవాడు కనిపించకుండాపోయి ఉంటాడు మా బాగా అయిందిమీకు అల్లాగే అవాలి" అందరికీ తలా కాస్త గడ్డిపెట్టాడు అప్పటికి రెడ్డి ఆగ్రహం చల్లారింది

మిగిలిన ముగ్గురు రాజా ఏమై ఉంటాడన్న చర్చలో పడ్డారు రాజా జీతం రాగానే గత నెలలో చేసిన బాకీలు తీర్చేసి మిగిలింది హారతి కర్పూరంలా తగలేస్తాడు రెండోవారం వచ్చేసరికల్లా ఇతర్ల దయాదాక్షిణ్యాలమీద లేకవాళ్ల అరువిచ్చే చొక్కాల్లో పొరపాటుగా వదిలివేసిన చిల్లరనోట్లమీద ఆధారపడ్తాడు అందుకే సాధారణంగా రెండోవారం తరువాత, ఇతర్ల చొక్కాలనే వాడ్తాడు

సుబ్బారావుకి ఆ క్రితంరోజు రాజాతో తను సినిమాకి వెళ్ళిన విషయం గుర్తుకు వచ్చింది ఆ విషయం మిగిలినవాళ్ళతో చెప్పి,

"నాతో వాడు ఇంటికి రాలేదు తరువాత వస్తానన్నాడు బస్సు ఛార్జీలకోసం అర్ధ రూపాయి అప్పడిగి సినిమాతోచేరి మూడు రూపాయల్రా! ముందు దాంతోచేరి ముప్పై అన్నాడు వాడిదగ్గర డబ్బుల్లేవు నాకు తెలుసు డబ్బుల్లేకుండా ఎక్కడికి వెళ్ళిఉంటాడు?" అని ప్రశ్నించాడు

"వనజా వాళ్ళింటికి వెళ్ళుండడు అక్కడికి వెళ్ళేటప్పుడల్లా ఆ పిల్ల తమ్ముడికి చాక్‌లెట్లు తీసుకువెళ్ళాలి వనజని సినిమాకి తీసుకువెళ్లాలి వనజా వాళ్ళ బామ్మకి తిరుపతి ప్రసాదం అని దార్లోకొన్న లడ్డూ లివ్వాలి ఖర్చుతో కూడినపని పోనీ వెళ్ళాడే అనుకొన్నా రాత్రి పదకొండుగంటల తరవాత వీ డక్కడే ఉంటానన్నా వాళ్ళు ఉండనివ్వరు కదా!" అని తేల్చాడు ప్రసాద్

"మెట్రిక్ ఆనర్స్ చదువుతున్న వాళ్ళ చుట్టాలమ్మాయి సుబ్బులింటికి వెళ్ళాడేమో?" అనుమానంగా అడిగాడు విశ్వనాథం అక్కడికి వెళ్తే ఒకోసారి రాత్రిళ్ళు అక్కడే నిద్రపోయి రావటం రాజాకి అలవాటు

"నిన్న నాతో వచ్చేసరికి వాడి మొహంమీద రెండ్రోజుల గడ్డం పెరిగుంది కనక వెళ్ళుండడు" అన్నాడు సుబ్బారావు

రాజా సుబ్బుల విషయంలో ఏడాది ట్రై చెయ్యగా మూడ్నెల్లక్రితం ఓ చిన్న అవకాశం వచ్చి అతనో చిన్న చొరవచెయ్యటం, ఆ పిల్ల "నీ గడ్డం రంపంలా గుచ్చుకొంటోంది" అని దూరంగా తోసివెయ్యటం, ఆ విషయం రాజా వీళ్ళకి దాపరికం లేకుండా చెప్పడంవల్ల వీళ్ళకు తెలుసు ఆపైన ఎప్పుడు సుబ్బులింటికి వెళ్ళినా గడ్డం నున్నగా గీసుకొని వెళ్ళడం, వెళ్తూ "ఏమో ఎవరికి తెలుసు! ఏ అదృష్టాలు నాకోసం ఎదురుచూస్తున్నాయో!" అని రాజా అనటం మామూలయ్యాయి అందుచేత రాజా సుబ్బులింటికి వెళ్ళుండడు

"నిన్న పువ్వుల చొక్కా చారల బెల్‌బాటమ్స్ వేసుకోలేదు కనుక రోజా ఇంటికి కూడా వెళ్ళుండడు" అని మళ్ళీ సుబ్బారావే అన్నాడు

"వెళ్ళుండడు లాస్టు శాటర్‌డే నా చొక్కా చింపుకొచ్చాడు ఈసారి నా బట్టల జోలికి వస్తే చంపేస్తానని నిన్న పొద్దున్న గట్టి వార్నింగిచ్చాను" అన్నాడు విశ్వనాథం

రాజాకి రోజా అంటే బోలుడు ముద్దు కాని రోజాకి, రాజా పువ్వుల చొక్కా చారల బెల్‌బాటమ్స్ వేసుకొన్నప్పుడే ముద్దువస్తాడు రోజాకి ఓ బుచ్చి కుక్కపిల్ల ఉంది ఆ క్రితం శనివారం రాజా, రోజాని మంచిచేసుకోడానికి గాను "మీ కుక్కపిల్ల ముద్దొస్తోంది" అంటూ దాన్ని చంకనెక్కించుకొన్నాడు ఆ కుక్కపిల్ల రాజా వళ్ళో ఆడుకోగా రాజా వేసుకొన్న చొక్కా చిరిగింది కాని చిరిగింది రాజాది కాదు విశ్వనాథంది ఆ విషయం క్రితంరోజు వరకు దాచి విశ్వనాథానికి క్రితం రోజే చెప్పాడు అతగాడికున్న రెండో పువ్వుల చొక్కా అరువిస్తాడేమో నన్న ఆశతో విశ్వనాథం చచ్చేలా చివాట్లు వేశాడు

ఉన్నట్టుండి రెడ్డి, "రాజా ఏమయ్యాడో నాకు తెలుసు" అన్నాడు

"ఏమయ్యాడు?" మిగిలిన ముగ్గురు ఒకే సారి అడిగారు

"నిన్న సుబ్బారావు రాజా మాట్నీకి వెళ్లారు మాట్నీ అయ్యాక ఈ సుబ్బిగాడు ఆ రాజా గాడిని ఎక్కడికో తీసుకువెళ్ళి హత్యచేశాడు"

"నేను హత్యచేసానా? నీకెల్లా తెలుసు? నే నెందుకు చేస్తాను?" సుబ్బారావు కంగారుగా అడిగాడు

"అల్లా అడుగు చెప్తాను మొన్నరాత్రి మీ నలుగురు బ్రిడ్జి ఆడారు నేను చూస్తూ కూర్చు న్నాను. ఆ దేముందు సుబ్బారావు రాజాతో గమనించదగ్గ మాటలన్నాడు అవి యిక్క డున్న వాళ్ళంతా విన్నారు 'ఒరేయ్ రాజా! ఈరోజునగాని ఆట తప్పాడావనుకో నీ ప్రాణం తీస్తాను పూర్వంలా ఇది ఉత్తి బెదిరింపుకాదు నిజంగా తీస్తాను' అన్నాడీ సుబ్బిగాడు అవునా?" రెడ్డి ఆగాడు

విశ్వనాధం ప్రసాద్‌లకి రెడ్డి ఏ దిక్కులో పోతున్నాడో అర్థంకాక "అన్నాడు అయితే?" అని ఒకేసారి అడిగారు

"ఆరోజు రాజా తప్పాడాడు ఎప్పుడు? వాళ్ళో ఆట గెలిచి వల్నరబుల్‌గా ఉన్నప్పుడు పైగా మీరూరుకోరు పోయేదేముంది అని డబుల్ చేసారు ఆ తప్పాడటంవల్ల గేము, రబ్బరు గెలవటంపోయి మూడు డౌనయ్యారు రాజా సుబ్బారావులు" రెడ్డి మళ్ళీ ఆగాడు

"అవు నా రోజు వెధవ చాలా పాయిం ట్లిచ్చాడు" అన్నాడు సుబ్బారావు గుర్తు తెచ్చుకొని

"ఈమాటలే అప్పుడూ అన్నావ్! కాని అగ్గిపోర్పుతో అన్నావు - 'ఒరేయి రాజా! ఇవ్వాళో రేపో నిన్ను చంపేస్తాన్రా' అంటూ ఆ మాటలు మొన్న అన్నావు, నిన్న వాడిని చంపవతల పారేసి చేతులు దులుపుకొంటూ ఇంటికొచ్చావ్!" రెడ్డి నేరం మోపాడు సుబ్బా రావు మీద

"సినిమా అయిపోగానే యెటో వెళ్లిపోయిన వాడిని నేనెల్లా చంపుతాను?" సుబ్బారావు రెడ్డి మాటలు కొట్టిపారేసాడు

"ఎటో వెళ్ళిపోయాడని నువ్వన్నావ్ ప్రూఫ్ లేదు చివరిసారిగా వాడితో బయటకు వెళ్ళింది నువ్వు నువ్వే ఒప్పుకొన్నావు నీతో వాడిని తీసుకువెళ్ళి, ఒంటరిగా తిరిగివచ్చావ్!" రెడ్డి తన వాదం విడిచిపెట్టలేదు

"ఒరేయి రెడ్డీ! వాడ్ని కాదుగాని నిన్ను చంపుతాన్రా!" అన్నాడు సుబ్బారావు కోపంగా

"మనకి పేకాటలో చాలాసార్లు పార్ట్‌నర్స్ మీద చాలా కోపంవస్తుంది నిజానికి చంపేయా లన్న కోపం వస్తుంది రావడంవరకు సబబే! కాని చంపడమే సబబుకాదురా సుబ్బయ్యా! రాజాని హత్యచెయ్యడం నీ మొదటి తప్పు అది ఒప్పుకొన్న రెడ్డిని చంపుతానని బెదిరిం చటం రెండో తప్పు" అన్నాడు విశ్వనాధం మందలింపు ధోరణిలో

"రెడ్డిని బెదిరించినా, హత్యచేసినా నే నర్థం చేసుకోగలను ఎందుకోగాని ఆ కోరిక నాకూ కలుగుతూ ఉంటుంది కాని రాజాని హత్య చెయ్యటం మాత్రం నాకు నచ్చలేదు వాడు పాపం అమాయకుడు వాడి కళ్ళు అమాయ కంగా చారడేసి ఉండేవి" ప్రసాద్ సంతాపం ప్రకటించాడు

సుబ్బారావుకి మిగిలిన ముగ్గురు తనని హంతకుడిలా ఊహిస్తుంటే వళ్ళు మండి పోతోంది కాని అశక్తుడు

"సుబ్బిగా నువ్వు హత్య చెయ్యలేదని కోర్టులో తేలేదాకా నువ్వు గిల్టియే! ప్రసాద్! విశ్వం! వీడిని గట్టిగా పట్టుకోండి. నేను తాడు తీసుకువస్తాను కుర్చీకి కట్టేద్దాం ఆపైన పోలీసుల్ని పిలుచుకువద్దాం" అన్నాడు రెడ్డి

ప్రసాద్ విశ్వనాధాలు సుబ్బారావు పైకి లంఘించి అతన్ని కదలకుండా ఒడిసి పట్టు కొన్నారు రెడ్డి తాడు తెచ్చాడు ముగ్గురుకలిసి తనని తాళ్ళతో కడుతుంటే తను ఆ తాళ్ళనుంచి బయటపడ్డాక మిగిలినవాళ్ళ కాబోయే భార్యల తాళ్ళు తెంపేస్తానని సుబ్బారావు శపథం చేసాడు విశ్వనాధం పోలీసులకోసం బయ ల్దేర్తుంటే సుబ్బారావుకి హఠాత్తుగా ఓ విషయం గుర్తుకు వచ్చి, "ఆగు విశ్వం! ఈ హత్యచేసింది నేను కాదు నువ్వు!" అన్నాడు.

దాంతో కథ కొత్త మలుపు తిరిగింది.



ప్రసాద్, రెడ్డి ఆశ్చర్యంగా వింటుంటే,

"ఇందాక మీరంతా రాజా, క్రితం శనివారం విశ్వనాధం పువ్వుల చొక్కా వేసుకొని, రోజా ఇంటికివెళ్ళి చింపి తీసుకువచ్చాడని ఆ విషయం విశ్వానికి నిన్ననే తెల్పిందని వాడి నోటితోనే అనగా విన్నారు. ఆ చొక్కా విశ్వనాధానికి ఆరో ప్రాణం రాజాకి తను గట్టిగా వార్నింగిచ్చిన విషయం వాడే ఒప్పుకొన్నాడు విశ్వం! నువ్వు రాజానేమని బెదిరించావ్?" అని అడిగాడు సుబ్బారావు.

"ఏమన్నాను? కోపంలో నా చొక్కాలు వేసుకోవద్దని చెప్తే వినవు ఆ చొక్కా సాయంత్రం లోపల రిప్లేస్ చెయ్యి! లేకపోతే "

విశ్వనాధంకి తన పొరపాటు అర్థమై ఆగిపోయాడు

"లేకపోతే పీక నులిమేస్తానన్నావు ఆ విషయం నిన్న సినిమాలో రాజా నాతో అన్నాడు అది రాజా మరణానికి ముందిచ్చిన మరణ వాంగ్మూలం రాజాకి నువ్వు తనని హత్య చేస్తావని తెలుసు అందుకే నువ్వు ఉరికంబం ఎక్కకుండా తప్పించుకోరాదన్న ఉద్దేశంతో నాకీ విషయం చెప్పాడు'' అన్నాడు సుబ్బారావు.

"ఏదో కోపంలో ఏదో అంటే మాత్రం'' విశ్వనాధం తగ్గాడు

"నేనుమాత్రం కోపంలో అనలేదు ఒరేయి విశ్వం మన స్నేహితులకి కొన్ని వీక్‌నెక్ ఉంటాయి వాటిని చూస్తుంటే మనకి చంపేయాలన్నంత కోపం కొన్నిసార్లు రావడం సహజం కాని చంపుకొంటూపోతే స్నేహితులు మిగల్రురా!'' అన్నాడు సుబ్బారావు కసి తీర్చుకొంటూ

"పోనీ నీమాటే తీసుకొందాం నేను వాడిని బెదిరించింది నిన్న పొద్దున్న. మధ్యాహ్నం నీతో సినిమాకి వెళ్ళిన రాజా సాయంత్రం ఇంటికి రాలేదు వాడిని నేను చంపడానికి మార్గంలేదే!'' అన్నాడు విశ్వనాధం!

"ఇంటికి రాలేదనడానికి సాక్ష్యం ఏది? రాత్రి పదింటిదాకా ఎక్కడో చచ్చి, వచ్చుంటాడు వాడు నిద్రపోతుంటే పీక నులిమేసుంటావు'' అని ఆరోపించాడు సుబ్బారావు

"బావుందిరా సుబ్బయ్యా! మరి శవాన్ని ఏంచేసుంటానంటావ్?" అని నవ్వుతూ అడిగాడు విశ్వనాధం, తను దాన్ని హాస్యంగా పరిగణిస్తున్నట్టు తెలియజేస్తూ

"తెల్లవారకట్టే శవాన్ని ఏ గోనెసంచీలోనో

కుక్కి స్కూటర్ వెనకాతల కట్టుకొని వెళ్ళి ఊరవతల దుబ్బుల్లో పారేసుంటావు''

"నేను గోనెసంచీలో శవాన్ని తీసుకు వెళ్ళడం యెవరైనా చూసారా?" అని విశ్వనాథం మిగిలిన ముగ్గుర్ని ప్రశ్నించాడు

రాజా దేహం గురించి విపరీతమైన శ్రద్ధ తీసుకొనేవాడు పగటిపూట కాలేజీకి, సాయంత్రాలు అమ్మాయిలకి, సూర్యోదయ పూర్వ కాలం దేహానికి రాజా కేటాయించేవాడు రాజాకి ఆడపిల్లలంటే వల్లమాలిన యిష్టం వాళ్ళకి బ్రూస్లీలాంటి దేహం ఉన్న అబ్బాయిలంటే ఇష్టం ఉంటుందని అనేవాడు అందుకని తనకి పొట్ట రాకుండాను, కండలు పట్టేటట్టుగాను జాగ్రత్తపడేవాడు అప్పుడప్పుడు విశ్వనాథం రాజాతో కలిసి ఊరు చివరదాకా పరుగెత్తేవాడు సుబ్బారావు ఆ విషయం గుర్తుచేస్తూ,

"నువ్వూ ఆ రాజా ఆరోగ్యంకోసం ఎన్నో సార్లు పొద్దునే పరుగెత్తడానికి వెళ్ళామని చెప్పారు మే మెప్పుడైనా చూసామా? మాకెవరికి తెల్లారే లేచే అలవాటు లేదు అందుకని చూసే అవకాశం లేదు రాజా ఎప్పుడు ఆరోగ్యమే మహాభాగ్యం, భాగ్యవంతులే అమ్మాయిల్ని ఆకర్షిస్తారు అనేవాడు భాగ్యవంతుల్ని దొంగవెధవలు హత్యచేస్తారని తెలియదు పాపం వాడికి!'' అన్నాడు

"పోన్లే సుబ్బయ్యా! నువ్వన్నదే ఒప్పుకొన్నా, పొద్దున్నే స్కూటర్‌కి శవం వున్న గోనెసంచీ కట్టుకొని వెళ్తుంటే ఎవరికీ అనుమానం కలగలేదంటావా? అందులోను పోలీసులకి." న్యాయంగా మాట్లాడు అన్నధోరణిలో అన్నాడు విశ్వనాథం

తన పీక నులిమేస్తానన్న విశ్వనాథంమీద రెడ్డి కేమాత్రం ప్రేమా గౌరవం లేకపోగా కోపం కసీ ఉన్నాయి. అందుకని "ఒరేయి విస్సిగాడి మాటలు వింటుంటే ఏమనిపిస్తోంది హత్య ఎల్లా చేస్తే దొరకకుండా తప్పించుకోవచ్చు అని చాలా ఆలోచించినట్టు కనిపిస్తోంది అందుకని వాడు రాజాని మన యింట్లో చంపి ఉండడు. ఇవాళ పొద్దున్న యధాప్రకారం ఊరవతలకి వీళ్ళు పరిగెత్తి వెళ్ళి వుంటారు వ్యాయామం కోసం అక్కడ రాజా పరధ్యానంగా ఆలోచిస్తూ వుంటే వీడు వాటినెత్తిన పెద్ద రాయి పడేసి వాడిని చంపి అపైన వాడి శవాన్ని గొయ్యితీసి కప్పెట్టేసి వుంటాడు పొద్దున్న నేను బనియనుమీద మట్టేమిట్రా? అని అడిగితే మొక్కలకి గొప్పులు తవ్వాను అన్నాడు వానపడబోతుంటే యెవరైనా గొప్పులు తవ్వుతారా?" అన్నాడు

"నిజమేరోయి! విశ్వానికి హత్య చెయ్యడానికి అవకాశం ఉంది'' అని గుర్తించాడు ప్రసాద్

"కనక బాబుల్లారా! నన్ను వదిలేసి వాడిని కుర్చీకి కట్టండి" అని సుబ్బారావు సూచించాడు

"మోటివ్, అవకాశం ఇద్దరికి వున్నాయి ఎలిబీ ఇద్దరికి లేదు'' ప్రసాద్ ఆలోచనలో పడ్డాడు

"ఒకే శవం రెండు హత్యలు అయ్యబాబోయి! ఇద్దరు హంతకులున్నారీ యింట్లో'' రెడ్డి గెంతాడు

"కావాలంటే నన్ను కట్టేయండి గాని వాడిని వదలకండి న్యాయస్థానంలో నిజానిజాలు తేల్తాయి'' అన్నాడు విశ్వనాథం మరో కుర్చీలో కూర్చుంటూ

ప్రసాద్, రెడ్డి రాజా మంచితనాన్ని ఇతర గొప్ప గుణాల్ని పొగుడ్తూ విశ్వనాథాన్ని బంధించారు వీళ్ళ ధోరణి చూస్తుంటే విశ్వనాథానికి సుబ్బారావుకి వళ్ళు మండిపోయింది సుబ్బారావు విశ్వనాథానికి కన్ను మలిపాడు వీళ్ళనో ఆట పట్టిద్దామని విశ్వనాథం సరేనన్నట్టు కళ్ళెగురవేసాడు

"రాజా మొన్న మనింటికి ఆ సరస్వతిని తీసుకువచ్చాడు గుర్తుందా రెడ్డీ!" అన్నాడు సుబ్బారావు

"ఉంది'' అన్నాడు రెడ్డి.

"ఎవరూ ఆ పుస్తకాల దయ్యం తీసుకు వెళ్ళిన పుస్తకాలని మాయంచేసే మహామ్మారి ఆ సరస్వతిని మళ్ళీ మనింటికి తీసుకువచ్చాడా"

అని ఆశ్చర్యపోయాడు విశ్వం

"సరిగ్గా ఆ సరస్వతినే గత సంవత్సరం ప్రసాద్ పుస్తకాలు వారంలో తిరిగిచ్చేస్తానని తీసుకువెళ్ళి ఇంతవరకు ఇవ్వని సరస్వతినే తీసుకువచ్చాడు ఆ అమ్మాయి మనింట్లోంచి ముళ్ళపూడి పుస్తకాలు తీసుకువెళ్ళింది ప్రసాద్ బెజవాడంతా గాలించికొన్న పుస్తకాలు!" అన్నాడు సుబ్బారావు తాపీగా

"బాబోయి నా పుసకాలు! ఏం నేతున్రా దేవుడా! నా పర్మిషన్ లేకుండా రాజా ఎల్లా ఇచ్చాడు?" అని గోలపెట్టాడు ప్రసాద్

"పర్మిషనడిగితే నువ్విస్తావుట్రా ప్రసాదం!" అని అడిగాడు విశ్వనాథం

"అందుకని నన్ను మాటవరసకైనా అడగకుండా ఆ రాజా నా పుస్తకాలిస్తాడా? ఆ రాజా——" అని ఆవేశంతో ఊగిపోయాడు ప్రసాద్

"చాలా మంచివాడు వాడి కళ్ళుచారడేసి" అని పూర్తిచేసారు విశ్వనాథం, సుబ్బారావు.

"ఏం కాదు! వాడు దుర్మార్గుడు! వాడిని మీ యిద్దర్లో కనీసం ఒకడైనా హత్యచేసాడా? లేకపోతే వాడిని నేను చంపుతాను" ప్రసాద్ శపథం చేసాడు

"ఏంఅబద్దాలాడుతున్నావురా నాయనా మొన్న రాత్రి నీకు సరస్వతి మనింటికి వచ్చిన విషయం చెప్పాను" అన్నాడు సుబ్బారావు

"అవును చెప్పావు ఆ పిల్ల కనిపిస్తే కింద టేడు తీసుకువెళ్ళిన రావకొండ కలెక్షన్ వెనక్కి ఇమ్మని అడిగేవాడిని కదా! అనుకొన్నాను అంతేగాని అప్పుడు నాకా అమ్మాయి నా ముళ్ళపూడి కలెక్షన్ పట్టుకుపోయుంటుందన్న విషయం తట్టలేదు" అన్నాడు ప్రసాద్

"సుబ్బారావు నీతో చెప్తున్నప్పుడు నేను ప్రక్కనే ఉన్నాను అప్పుడే మన్నావో చెప్పనా! అవకాశం దొరకగానే వాడిని చంపేస్తానన్నావు ముళ్ళపూడి రాచకొండలమీద ఆన అన్నావు రెడ్డి మా కట్లు విప్పేయి వీడే ఆ రాజాని చల్లగా చంపి దూరంగా పారేసి ఉంటాడు ప్రసాద్‌ని కట్టెయ్యాలి మనమంతా" అన్నాడు

రెడ్డి విశ్వనాథాన్ని, సుబ్బారావుని విడిపిస్తూ "అయ్యబాబోయి ఇక్కడ ప్రతివాడికి హత్య చెయ్యడానికి ఒక కారణం వుంది" అన్నాడు

"ఆగు రెడ్డీ! ఆ మాట మళ్ళీ అను" అన్నాడు ప్రసాద్

"హత్య చెయ్యడానికి ఇక్కడున్న అందరికి తలా ఒక కారణం ఉంది అన్నాను"

'అంటే నీకు కూడా కదా?"

"నాకా! నేను సాధువుని కారణం ఉన్నా, హత్యచెయ్యను రాజా నా ప్రాణస్నేహితుడు"

"ప్రాణ స్నేహితులన్నాక ఇచ్చి పుచ్చుకోడాలుంటాయి కదా ప్రాణాల విషయంలో" అన్నాడు విశ్వనాథం

"ఒరేయి విస్సిగా! ఈ ప్రసాద్ తమాషాకి అంటున్నాడు సీరియస్‌గా తీసుకోకు నువ్వు మాత్రం సీరియస్‌గా తీసుకొంటున్నావేమిటి? ఏదో నన్ను ఆటలు పట్టిద్దామని అంటున్నావు గాని కదురా! నీకు సెన్స్ ఆఫ్ హ్యూమర్ ఎక్కువరా" అంటూ రెడ్డి దాన్నో జోక్‌గా జమకట్టెయ్య బోయాడు

"ఇంతకు వాడికున్న కారణం ఏమిటి?" అని సుబ్బారావు ప్రసాద్‌ని అడిగాడు ప్రసాద్ గుర్తుచేసాడు

బుధవారం రాత్రి వాళ్ళంతా యథాప్రకారం అడ్డాట ఆడుతున్నారు రెడ్డి అందరి ముక్కలు చూసి రాజాదగ్గర ఒంటరి మణేలా ఉందని ప్రసాద్‌కిచెప్పి ప్రసాద్‌కి జాకీ ఆడమని సలహా పారేసాడు ప్రసాద్ సలహా మేరకు ఆడి రాజా మరేలా రాల్చాడు

"రాజా అప్పుడే రెడ్డిని పాతేస్తా నన్నాడు" అన్నాడు ప్రసాద్

"నీమాట ప్రకారం రాజా నన్ను హత్య చేసుండాలి! నేను బతికే ఉన్నాను నేను చచ్చిపోయినప్పుడీ విషయం చెప్పాలి ఇవాళ చెప్పాల్సిన కథకాదు ఇది" అన్నాడు రెడ్డి సంబరంగా

"కాని రెడ్డి ఇల్లాంటిపనే మళ్ళీ శుక్రవారం,



రాత్రి సరస్వతి వెళ్ళిపోయాక మనం పేకా డుంటే చేసాడు అప్పుడు రాజా " అని ప్రసాద్ చెప్పబోతుండగా

"నన్నుప్పుడు పాతరవేస్తానన్నాడు. ఇంకేం వేస్తాడు పాపం వాడినే, మీలో ఎవరో ఒకరు వేసారు" అన్నాడు రెడ్డి

"మాలో ఒకరుకాదు వేసింది నువ్వు" అన్నాడు సుబ్బారావు శుక్రవారం రాత్రి జరిగిన కథ గుర్తు తెచ్చుకొని

"నువ్వు నన్ను చంపేలోపల నేనే నిన్ను చంపేస్తాన్రా రాజా! అన్నావు వాడితో గుర్తుందా?" అన్నాడు విశ్వనాథం

"అంటే అన్నానేమో. కాని నాకు అవకాశం లేదే!" అన్నాడు రెడ్డి నిబ్బరంగా

"ఉంది అదే నేను చెప్పదల్చుకొన్నది నిన్న పొద్దున్న కాలేజీకి వెళుతూ రాజా తనకి తలనొప్పిగా ఉందన్నాడు నువ్వు వాడికి మందనిచెప్పి ఏదో మాత్రిచ్చావు" అన్నాడు ప్రసాద్.

"అవును నాది జాలిగుండె."

"అవును జాలితో వాడికి తలనొప్పి మందని చెప్పి విషం ఇచ్చావు రెడ్డీ! విషాన్నిచ్చావ్!"

"హాస్యాన్నికూడాఅంతుండాల్రాప్రసాద్ ఆ మాత్ర రాజా నిన్న పొద్దున్న కదా వేసుకొంది నిన్నసాయంత్రం మేటనీ అయ్యేవరకు ఏ వికారం లేకుండా ఉన్నాడని సుబ్బారావు ఇందాక స్టేట్‌మెంటిచ్చాడు అంటే రాత్రి ఏ పదింటికో ఇంటికివస్తూ ఢామ్మని రోడ్డుమీద చచ్చిపోయాడంటావా నేనిచ్చిన విషంవల్ల! అదేమన్నా సినిమాల్లో చూపించే టైము బాంబా? అయినా నే నిచ్చింది తలనొప్పిమాత్రని విషం కాదని మీ అందరికి తెలుసు" అన్నాడు రెడ్డి తనని వాళ్ళు ఆటలు పట్టిస్తున్నారన్న విషయంలో తన కేమాత్రం అనుమానం లేదన్న ధోరణిలో

"నాకేం తెలియదు నాకు తెలిసిందల్లా మీ ముగ్గురిలో ఒకడు హంతకుడు" అన్నాడు సుబ్బారావు

"కాదు మీ ముగ్గుర్లో" అన్నాడు విశ్వనాథం

"మీ ముగ్గుర్లో" అన్నాడు ప్రసాద్, మిగిలిన ముగ్గుర్ని ఉద్దేశించి

"కాదు బాబోయ్ మీ ముగ్గుర్లో" అన్నాడు నెత్తి నోరు కొట్టుకొంటూ రెడ్డి.

ఆ ముగ్గురు అల్లా పరస్పరం హాశ్యాళి యోగాలు చేసుకొంటుంటే రాజా ఊడిపడ్డాడు తూలిపడ్డాడు వీధిలోంచి వచ్చి కుర్చీలో కూలబడ్డాడు

దెయ్యం అని అరిచాడు రెడ్డి మిగిలిన ముగ్గురు ఏకీభవించారు రాజా తను బతికే ఉన్నానంటూ మొరపెట్టుకొన్నాడు

మిగిలిన నలుగురూ ఒకళ్ళ నొకళ్ళు గిల్లుకున్నారు ఆపైన ఎందుకైనా మంచిదని రాజాని గిల్లి చూసారు అతను గోలపెట్టాడు ఆవిధంగా వచ్చింది రాజా దయ్యం కాదని రాజాయేనని నిర్ధారించుకొన్నారు సుబ్బారావుకి అతని గురించి తాముపడ్డ హైరానా అంత గుర్తుకువచ్చి

నిన్న సాయంత్రం నేను నిన్ను అర్ధ రూపాయి యిచ్చి వదిలిపెట్టాక ఇప్పటివరకు ఎక్కడ చచ్చావు? అని కోపంగా ప్రశ్నించాడు

రాజా ఆ చిన్నకథ చెప్పాడు రాజా క్రితం రోజు సాయింత్రం సుబ్బారావుదగ్గర అర్ధ రూపాయి అప్పుచేసి ఫ్రెండింటికి అప్పుకోసం వెళ్ళాడు అతను అప్పిస్తే విశ్వనాథానికి తను చింపుకువచ్చిన చొక్కా తాలుకు నష్టం భర్తీ చేద్దామనుకొన్నాడు అయితే అక్కడ పరిస్థితులు రాజా ఎదురుచూడనివి ఆ స్నేహితుడి భార్య తప్పనిసరై భర్తను వదిలిపెట్టి పుట్టింటికి వెళ్ళింది ఆ ఫ్రెండ్ స్ప్రింగ్‌ని నొక్కి ఉంచి ఒక్కసారిగ వదిలిపెడ్తే ఎలా ఎగిరెగిరి పడ్తుందో అల్లా ఎగిరిపడ్తూ భార్య అక్కడ లేకపోవడాన్ని సెలబ్రేట్ చేసుకొనే మూడ్‌లో ఉన్నాడు రాజాని చూడగానే కౌగలించుకొని కంపెనీ ఇమ్మని బతిమాలాడు ఖర్చు తనదే నన్నాడు ఇద్దరు తాగి హోటలుకు వెళ్ళి భోంచేసి తిరిగి ఫ్రెండింటికి వచ్చి తిరిగి తాగారు పొద్దున్న లేచేసరికి ఆలస్యం అయింది రాత్రి తాగగా మిగిలిపోయిన ద్రవాలు వానపడ్తున్న కారణంగా పొద్దున్న ఖాళీ చేసారు మళ్ళీ నిద్రపోయారు సాయంత్రం లేచి రాజా నడిచి కార్లని బళ్ళని తప్పించుకొంటూ రాలేదు కనక రిక్షాలో బుద్ధిగా వచ్చాడు రిక్షావాడికి డబ్బు ఆ స్నేహితుడే ఇచ్చాడు ఈ కథంతా చెప్పి

ఇదిగోరా సుబ్బారావు నీ అర్ధరూపాయి అవుసరం లేకపోయింది అని తిరిగి ఇచ్చాడు

నా చొక్కా మాటేమిటి? విశ్వనాథం నిలదీసాడు

సరస్వతి తీసుకువెళ్ళిన నా పుస్తకాల సంగతి? ప్రసాద్ నిలదీసి పట్టుకొని ప్రశ్నించాడు

సరస్వతి రాగానే ఊరెళ్ళిందితే అవి తీసుకొని ఇప్పించేస్తాను జీతాలురాగానే చొక్కా కొనేస్తాను ఇద్దరికి పనికి వస్తుంది అంటూ రాజా నిలవలేక కుర్చీలోకి జారిపోయాడు

ఇవాళ రాజా వేసుకొన్న చొక్కా నాది వీడిని అంటున్న రెడ్డికి సాయం వచ్చి

చంపేద్దాం అన్నారు మిగిలిన ముగ్గురు □

మీరు చదివారా!

ప్రమోద
పిల్లల మాస పత్రిక

వెల రూ. 1-25
సం. చందా
రూ 15/-